

జిజిహెచ్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా సురేశ్వరరెడ్డి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన సూపర్‌స్పెషాలిటీ, సైక్రియాటిక్, కేన్సర్‌కేర్ విభాగాలకు నూతన పర్యవేక్షకులు నియమితులయ్యారు. డిఎంఇ జిల్లా పర్యటన వచ్చిన సందర్భంగా సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సురేశ్వరరెడ్డి, కేన్సర్‌కేర్ నిర్వాహకురాలుగా డాక్టర్ కె.శ్రీవాణి, సైక్రియాటిక్ విభాగం నిర్వాహకులుగా డాక్టర్ వెంకటరాముడుకు బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. ఈ నెల 23వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో రూ.429 కోట్ల వ్యయంతో కూడిన సూపర్‌స్పెషాలిటీ, కేన్సర్‌కేర్, సైక్రియాటిక్ బ్లాకులను ప్రారంభించనున్నారు. ఏపిఎం ఎస్‌ఐడిసి ఇంజినీరింగ్ విభాగం యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతోంది.

మైదుకూరులో వంటావార్పుతో నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు



మాగోడు పట్టదా?

- వంటావార్పు, భిక్షాటన, మావనహారాలతో నిరసన
- సమ్మెకు పెరుగుతోన్న మద్దతు

అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మె రోజురోజుకూ ఉధృతం అవుతోంది. రోజుకో విన్నూత రీతిలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ నిరసన నిర్వహిస్తున్నారు. మంగళవారం జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వంటావార్పుతో నిరసన తెలియజేసి అక్కడ భోజనాలు చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో ముఖ్యమంత్రి ఇచ్చే వేతనాలు చాలడం లేదని, పెంచమంటే మొండిగా వ్యవహరిస్తున్నారని, మీరైనా సాయం చేయాలని దుకాణాల వద్దకు వెళ్లి భిక్షాట చేసి తన నిరసన తెలియజేశారు. ఇంకొన్ని ప్రాంతాల్లో ప్రదర్శనలు నిర్వహించి పట్టణాల్లోని నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఇంత ఉధృతంగా ఆందోళన చేస్తుంటే తమ గోడు ప్రభుత్వానికి పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ ఆందోళనకు టిడిపి, జనసేన, కాంగ్రెస్, వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకులు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించి ఆందోళనలో భాగస్వామ్యులయ్యారు.

మైదుకూరు : మైదుకూరు సిడిపిఒ కార్యాలయం ఎదుట సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తల సమ్మెలో భాగంగా మంగళవారం వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు శిబిరం వద్దే భోజనాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు, ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు, ప్రభుత్వ మొండి వైఖరి నశించాలి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సుధాకర్, షరీఫ్, బాలరాజు, రవి, రాజా, జహంగీర్ భాష, సిఐటియు, ఎఐటియుసి, భారతి, ధనలక్ష్మి, గంగావతి, చెన్నమ్మ, శోభ పాల్గొన్నారు. **వేంపల్లె :** సమ్మెలో భాగంగా అంగన్వాడీలు పట్టణంలో బిక్షాటన చేశారు. 8 రోజుల నుంచి అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం అంగన్వాడీ మహిళాలు అందరూ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కూడలిలో మానవహారం చేసి నిరసన వ్యక్తం చేశారు. దుకాణాల వద్దకు వెళ్లి ప్రభుత్వం జీతాలు పెంచలేదని, కాబట్టి భిక్షం వేయాలని అంగన్వాడీలు బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు, ఎఐటియుసి నాయకురాలు లలితా దేవి, సరస్వతి, శైలజాలు మాట్లాడుతూ 8 రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడం సిగ్గుచేటన్నారు. అరకొర జీతాలతో కుటుంబాలను పోషించుకోలేక అవస్థలు పడుతున్నామని వాపోయారు. పాదయాత్రలో జగన్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఎం జగనన్న అంగన్వాడీ మహిళాల పట్ల కనికరం చూపి జీతాలు పెంచడంతో పాటు అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న సమస్యలను పరిష్కరిం చాలని కోరారు. కార్యక్రమంలో వేంపల్లె, వేముల, చక్రాయపేట మండలాలలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **చాపాడు :** ఎనిమిది రోజులుగా తమ న్యాయమైన కోరికలను పరిష్కరించాలని అంగన్వాడీ కార్యకర్తలు చేపడుతున్న నిరసనలకు మంగళవారం బాలింత తల్లులు, అంగన్వాడీ పిల్లల తల్లులు మద్దతు తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపడుతున్న నిరసన దీక్షలో తల్లులు పాల్గొని తమ పిల్లల ఆలన, పాలనా చూసే అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు దీక్షలకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తల నాయకులు సుజాత, అరుణ, మహాలక్ష్మి , కార్యకర్తలు పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** ప్రభుత్వమిచ్చిన హామీలు అమలు, గ్రాట్యుటీ, సంక్షేమ పథకాల వర్తింపు తదితర డిమాండ్లతో అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో అంగన్‌వాడీలు పెద్దసంఖ్యలో సమ్మె శిబిరానికి తరలి వచ్చి వంటావార్పు కార్యక్రమంతో వినూత్నంగా నిరసన తెలిపారు. తమ డిమాండ్లు అంగీకరించే వరకు సమ్మె విరమించమన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు , ఆయాలు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** సిఐటియు, ఎఐటియుసి, అర్బన్ సెంటర్లో ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల సమ్మె ఎనిమిదవ రోజు చేరుకుంది. ఈ సందర్భంగా అంగనవాడి కార్యకర్తలు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అంగన్వాడీ జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి మాట్లాడుతూ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా మొండి వైఖరి అనుసరించడం మంచి పద్ధతి కాదని, ఎన్నికల ముందు అధికారం కోసం అనేక రకాల అబద్ధాలు చెప్పి అంగన్వాడీ వర్కర్లను మోసం చేశారని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, సిఐటియు కార్యదర్శి విజయ్ కుమార్, ఎఐటియుసి నాయకులు విజయమ్మ, ఎఐటిసి రాష్ట్ర నాయకులు మంజుల, అంగన్వాడీలకు మద్దతుగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ముంతాజ్ బేగం, ప్రొద్దుటూరు మహిళా సంఘం కార్యదర్శి వెంకటసుబ్బమ్మ, రాములమ్మ, లక్ష్మీదేవి, ప్రగతిశీల కార్మిక సంఘం నాయకులు శీను, హరిత, నాగేంద్ర, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రవీంద్రుడు, ఎస్‌టియు నాయకులు రషీద్ ఖాన్, టీచరు గంగరాజు ఉపాధ్యాయ సంఘం నాయకుడు వంటేరు శ్రీనివాసులరెడ్డి, ఎస్ఎఫ్ఐ దేవిద్రాజు, కార్మిక సంఘ నాయకుడు ఏసేపు, టిడిపి నాయకులు హరిత మౌనిక మద్దతు తెలిపారు. అంగన్వాడీ కార్యదర్శి సుబ్బలక్ష్మి, నాగలక్ష్మి, రాజి,నిర్మల,సునీత,పద్మ,సుబ్బలక్షమ్మ యూనియన్ కార్యదర్శి సాల్మన్ అంగన్వాడీ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** అంగన్వాడీ సెంటర్ల బీగాలు పగలగొట్టడం ప్రభుత్వానికి సిగ్గుచేటని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ముందు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు యన్ భైరవ ప్రసాద్ అధ్యక్షతన అంగన్వాడీవర్కర్లు ,హెల్పర్లు మినీ అంగన్వాడీ వర్కర్లు సమ్మె ఎనిమిదవ రోజు వంటావార్పు కార్యక్రమంతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపిప్రభుత్వం దుర్మార్గంగా పాలిస్తుందని చెప్పారు. ఎనిమిది రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు సెంటర్లు మూసేసి రోడ్డుపైకి వచ్చి జీతాలు కోసం సమ్మె చేస్తుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని వాపోయారు. అంగన్వాడీలు జీతాలు పెంచమని అడిగితే ఏమాత్రం పెంచకుండా దోబూచులాడుతూ వెనక్కి పంపడం సబబు కాదన్నారు. ప్రభుత్వం వెంటనే అంగన్వాడీ వర్కర్లని చర్చలు పిలిపించి వారి న్యాయమైన కోరికలను తీర్చాలన్నారు కార్యక్ర మంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యురాలు ఓబులాపురం విజయమ్మ, అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి మేరీ, వినోదా, దస్తగిరిమ్మ, రేణుక, విజయమ్మ, జ్యోతిమ్మ, రమాదేవి, శ్రీదేవి, లక్ష్మీదేవి, 200మంది అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు మినీ అంగన్వాడీ వర్కర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కడప అర్బన్ :** అంగన్వాడీలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి అండగా నిలబడతామని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆలం ఖాన్ పల్లె లక్ష్మీ రెడ్డి, జనసేన జిల్లా ఇన్‌ఛార్జి సుంకర శ్రీనివాసులు, టిడిపి కార్పొరేటర్ ఉమాదేవి అన్నారు. మంగళవారం నగరంలో అంగన్వాడీలు 8 రోజులుగా చేస్తున్న శాంతియుత నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్కటి నెరవేర్చకపోవడం దుర్మార్గమన్నారు. ప్రస్తుతం అంగన్వాడీలు, ఆశా వర్కర్లు రోడ్ ఎక్కారని, త్వరలో మున్సిపల్ కార్మికులు కూడా రోడ్డు ఎక్కనున్నట్లు పేర్కొన్నారు. అంగన్వాడీలు, ఆశ వర్కర్లు చేస్తున్న దీక్షలకు ప్రభుత్వం దిగి రాకపోతే రాబోయే రోజుల్లో మరెన్నో ఉద్యమాలు వస్తాయని చెప్పారు. ప్రజల తరపున నిలబడి వారికి సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం చేస్తామని తెలిపారు ముఖ్యమంత్రి ఇప్పటికైనా అంగన్వాడీ, ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాలకొండ మాజీ చైర్మన్ ఓబుల్ రెడ్డి, పత్తి విశ్వనాథ్, అంగన్వాడి, ఆశ వర్కర్లు, ప్రజా సంఘాలు పాల్గొన్నాయి.



వేంపల్లె : వినూత్నంగా భిక్షాటన చేస్తున్న అంగన్వాడీలు



కడప : అంగన్వాడీల ఆందోళనకు మద్దతు తెల్పుతున్న టిడిపి, జనసేన నాయకులు



పులివెందుల : వంటా వార్పులో భోజనం చేస్తున్న అంగన్వాడీలు

23 నుంచి సిఎం జిల్లా పర్యటన

ప్రజాశక్తి -పులివెందుల టౌన్



ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి మూడు రోజుల జిల్లా పర్యటన ఖరారైంది. ఈ నెల 23, 24,25 తేదీలలో పర్యటించనున్నట్లు అధికారికంగా షెడ్యూలు వెలువడింది. 23న ఉదయం 10.45 గంటలకు కడప ఎయిర్ పోర్టుకు ప్రత్యేక విమానంలో చేరుకుంటారు. ఇక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో నేరుగా గోపవరం చేరుకొని సెంచరీ ప్లై ఇండస్ట్రీస్ ప్రారంభిస్తారు. అనంతరం మీడియం డెన్సిటీ ఫైబర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తారు. ఒంటి గంటకు కడప రిమ్స్‌కు చేరుకొని వైఎస్ఆర్ సూపర్ స్పెషాల్టి హస్పిటల్, డాక్టర్ వైఎస్ఆర్ మానసిక వైద్యశాలను, కేన్సర్ కేర్ బ్లాక్, ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రిని ప్రారంభిస్తారు. ప్రక్కనే ఉన్న వై.ఎస్.ఆర్. క్రికెట్ స్టేడియానికి చేరుకొని ఫ్లడ్‌లైట్లను ఆవిష్కరిస్తారు. నేరుగా కడప కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని విభిన్న ప్రతిభా వంతులకు ట్రై స్కూటర్లను పంపిణీ చేస్తారు. అనంతరం రెన్యూ ఫైర్ ఎక్విప్‌మెంట్ పరికరాలను ప్రారంభించి కలెక్టరేట్ ఆధునీకరణ పనులను ప్రారంభించి కలెక్టరేట్ లోని కంట్రోల్ రూంను సందర్శిస్తారు. నేరుగా మధ్యాహ్నం 3.10 గంటలకు ఆర్‌టిసి సమీపంలోని అం బేద్కర్ జంక్షన్‌కు చేరుకొని అంబేద్కర్ జంక్షన్ -వైజంక్షన్ మధ్య రోడ్ల విస్తరణ పనులను ప్రారంభిస్తారు. అనంతరం కోటిరెడ్డి సర్కిల్‌కు చేరుకొని దండి మార్చ్ విగ్రహాన్ని ప్రారంభించారు. ఆధునీకరించిన ఏడురోడ్ల కూడలిని మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసే అంతర్జాతీయ హాకీ కోర్టుకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం కడప ఎయిర్ పోర్ట్ నుంచి ఇడుపుల పాయకు చేరుకుంటారు. 24న ఉదయం 8.30 గంటలకు ఎస్టేట్ లోని ప్రార్థన మందిరానికి చేరుకొని ప్రార్థనలు నిర్వహిస్తారు. ఇడుపుల పాయ నుంచి హెలికాప్టర్ ద్వారా సింహాద్రిపురంలో జూనియర్ కళాశాలను చేరుకొని ప్రజలతో ముఖా ముఖి మవుతారు. 12.45 గంటలకు రోడ్డు విస్తరణ పనులను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1.20 గంటకు వైఎస్ఆర్ పార్కు, తహశీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ఎంపిడిఒ కార్యాలయాలను ప్రారంభిస్తారు. 3.10 గంటలకు ఎకో పార్కు చేరుకొని సమావేశం నిర్వహిస్తారు. ఈనెల 25న పులివెందులలోని భాకరాపురం సిఎస్‌ఐ చర్చిలో ఉదయం 9 గంటలకు క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొంటారు. పులివెందుల నుంచి కడప ఎయిర్ పోర్టుకు చేరుకొని మధ్యాహ్నం 1.20 గంటలకు తాడేపల్లిలోని ముఖ్యమంత్రి నివాసానికి చేరుకొంటారు.

ఉరితాడును ముద్దాడిన అమరవీరులు

- బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్‌కు నివాళి

ప్రజాశక్తి - బద్వేలు

దేశం కోసం ప్రాణాలర్పించి అమరులైన రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లాఖాన్ త్యాగం మరువలేనిదని వైవీయూ కౌన్సిల్ సభ్యులు కొండపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్‌లో ఉన్న నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో హిందూ ముస్లిమ్ ఐక్యత దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొండపల్లితోపాటు డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు జి. నాగార్జున, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎస్. మహబూబ్ బాషా (బిగ్ బాస్), ఆవాజ్ జిల్లా కమిటీ అధ్యక్షులు పి .చాంద్‌బాష, డిహెచ్‌పిఎస్ జిల్లా జిల్లా ఆర్గనైజర్ సెక్రెటరీ పడిగే వెంకటరమణ, డిహెచ్‌పిఎస్ పట్టణ అధ్యక్షులు శిల్పారమణ, ముస్లిం మత పెద్దలు అమిర్ సాబ్ హాజరయ్యారు. ముందుగా వేమన యూనివర్సిటీ కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన అమర వీరుల త్యాగాలను ఎన్నటికీ మరువ రాదని చెప్పారు. డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ఐకమత్యంగా పోరాడి ఉరితాడును ముద్దాడిన పోరాట యోధులు అని అన్నారు. రత్నం స్కూల్ కరస్పాండెంట్ తలారి రత్నం మాట్లాడుతూ వీరు వివిధ మతాలకు చెందిన వారుగా ఉన్నప్పటికీ దేశం కోసం దేశ స్వాతంత్రంలో ప్రాణత్యాగం చేసిన మహనీయులని కొనియాడారు. డిహెచ్‌పిఎస్ జిల్లా ఆర్గనైజర్ సెక్రెటరీ వెంకటరమణ మాట్లాడుతూ నేటి రాజకీయనాయకులు ఓటు బ్యాంకు కోసం హిందూ ముస్లిం మైనారిటీలలో విభేదాలు సృష్టించి ముస్లింలలో మైనార్టీలలో అభద్రతా భావాన్ని పెంచుతున్నారని పేర్కొన్నారు. వీరి స్నేహం, త్యాగాలను ప్రభుత్వం పాఠ్యపుస్తకాలలో ముద్రించాలని విన్నవించారు. కార్యక్రమంలో బద్వేల్ ఆవాజ్ కమిటీ అధ్యక్షులు కార్యదర్శులు ఉపాధ్యక్షులు ఎస్.ఎ. సత్తార్, అన్వర్ భాష, దావూద్ వలి, ఖాజాగౌస్, జగన్ ట్రావెల్స్ రసూల్, మస్తానయ్య సుదర్శన్ రావు, లక్ష్మణ్ సలీం హపీ సాబ్ , మహమ్మద్ అలీ , నాగూర్ పాల్గొన్నారు. **కడప అర్బన్ :** దేశ స్వాతంత్ర్య కోసం అనేకమంది యువకిశోరాలు తమ ప్రాణాలను ప్రాణంగా పెట్టి పోరాడిన వారిలో పండిత రాంప్రసాద్ బిస్మల్, అష్ఫాఖుల్లాఖాన్ 30 ఏళ్లకే నూరేళ్ళ ఖ్యాతిని ఆర్జించారని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ అన్నారు. మంగళవారం ఆప్‌కి ఆవాజ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో స్వతంత్ర సమరయోధులు అమరవీరులు పండిత రాంప్రసాద్, అష్ఫాఖుల్లాఖాన్ 96వ వర్ధంతి సభ 'హిందూ ముస్లింల ఐక్యత దినోత్సవం' కార్యక్రమంలో నగరంలోని సహారా షాది ఖానాలో ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఆరిఫ్ ఖాన్ అధ్యక్షతన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఆర్‌సి జెఎసి కన్వీనర్ అహమ్మద్ బాబు బాయ్, ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మక్బూల్ బాషా, ఐయుఎంఎల్ పార్టీ జిల్లా అధ్యక్షులు అలీ షేర్, జెకె యూత్ అధ్యక్షులు పఠాన్ ఖాదర్ బాషా, సామాజిక కార్యకర్త జావిద్, యునైటెడ్ ముస్లిం ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రఫీ ఖాన్ హాజరయ్యారు. కార్యక్రమంలో రాయలసీమ మహిళా సంఘం జిల్లా నాయకులు తస్లీమ్, కరిమున్, చాంద్ బేగం, ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఖాసిం వలి, జిల్లా నాయకులు జిలాని బాషా, జమీన్, మున్నా, ఆర్ టి యు యూనియన్ నాయకులు శివ రెడ్డి, పెంచలయ్య, ఓబులేసు, డీఎంకే పార్టీ జిల్లా అధ్యక్షులు సుబ్బరాయుడు పాల్గొన్నారు.



బద్వేల్‌లో అమరవీరులకు నివాళులర్పిస్తున్న మైనార్టీ నాయకులు

పోరాటాలకు సిద్ధం కావాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు మరిన్ని పోరా టాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు వినోద్ కుమార్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా మహా సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్క రించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ విద్యా వ్యవస్థను పెంచి పోషిస్తుందన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయకుండా వారి జీవితాలతో చెల గాటం ఆడుతుందన్నారు. అనంతరం ఎస్ఎఫ్క్మి జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం వల్ల గ్రామీణ ప్రాం తాలలో చదవుతున్న పేద విద్యార్థులు విద్యకు దూరమై డ్రాపౌట్స్‌గా మిగిలే ప్రమాదం ఉం దన్నారు. రాష్ట్రంలో ప్రతి ఏటా చదువుకున్న విద్యార్థులు వేల సంఖ్యలో చదువులు పూర్తి చేసుకుని బయటకు వస్తున్న వారికి ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. చదువుకున్న అందరికి ఉపాధి కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గండి సునీల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు రాహుల్, నాయక్, వినయ్, సహాయ కార్యదర్శులు రవి, జిల్లా కమిటీ సభ్యులు వినయ్, అజయ్, రాజశేఖర్ పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు వినోద్‌కుమార్

సకాలంలో జీతాలు చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులతో నెల మొత్తం పని చేయించుకుని ఒకటో తేదీ జీతాలు చెల్లించలేని దుర్భర స్థితిలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉండడం సిగ్గుచేటని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు అన్నారు. మంగళవారం కలెక్టర్ వివిధ సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ధర్నా నిర్వహిస్తామని నోటీసు కార్యాలయ పరిపాలనాధికారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులపై కక్షగట్టి వారిని వేధించడమే పనిగా పెట్టుకున్నట్లుగా వ్యవహరిస్తుందని తెలిపారు. రెండు సంవత్సరాలుగా ఒకటో తేదీ జీతం చెల్లించడం గగనమైపోయిందని చెప్పారు. డిమాండ్ల సాధనకై ఈనెల 20 నుంచి ఎమ్మె ల్యేలు, మంత్రులకు వినతి పత్రాలు ఇవ్వడం, 27 నుంచి తాలూకా కేంద్రాల్లో ఆరు గంటల ధర్నా కార్యక్రమం నిర్వహించడం, జనవరి మూడో తేదీన జిల్లా కేంద్రంలో 12 గంటల ధర్నా కార్యక్రమం, జనవరి 7,8 తేదీల్లో రాష్ట్ర కేంద్రంలో 36 గంటల ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ ఆందోళనలను గమనించి తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు వై. రవికుమార్, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, నాయకులు బాబు, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

నెరవేరనున్న చిరకాల స్వప్నం : డిప్యూటీ సిఎం

కడప అర్బన్ : బుగ్గ వంకపై పెడెస్ట్రైన్ బ్రిడ్జ్ నిర్మాణంతో నగర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరునుందని ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా ఆనందం వ్యక్తం చేశారు. మంగళవారం రవీంద్ర నగర్ లోని బుగ్గ వంకనది పైన పెడెస్ట్రైన్ బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్సీ రామచంద్రా రెడ్డి, నగర మేయర్ సురేష్ బాబు, కమిషనర్ ప్రవీణ్ చంద్ లతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా నగర ప్రజలు ఎదురుచూస్తున్న బుగ్గ వంక నదిపై రూ. 20 కోట్లతో రెండు బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. వరదలు వచ్చిన ప్రతిసారీ రవీంద్ర నగర్, నాగరాజు పేట ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారని, ఇక నుంచి కష్టాలుండవని చెప్పారు.

పగటిపూట వీధిలైట్లు వెలిగితే చర్యలు తప్పవు

ప్రజాశక్తి-అట్లూరు

మండలంలో ఎక్క డైనా పగటి పూట వీధిలైట్లు వెలు తున్నాయని తన దృష్టికి వస్తే సం బంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని విద్యుత్ ఎస్ఇ రమ ణ హెచ్చ రించారు. మంగళవారం ఆయన అట్లూరులోని 33/11 సబ్‌స్టేషన్‌ను, లైనట్లను, ట్రాన్స్‌ఫార్మర్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సంబంధిత సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం విద్యుత్ కార్యాల యంలో ఏర్పటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెలలోపు విద్యుత్ అంతరాయాలు తగ్గించడానికి, అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను కత్తిరించారన్నారు. గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరమూ సరఫరా చేయాలని ఆదే శించారు. క్షేత్ర స్థాయి సిబ్బందికి కేటా యించిన ప్రదేశాల్లో నివాసముంటూ విద్యుత్ ప్రమా దాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. విద్యుత్ ప్రమాదాల నివా రణే లక్ష్యంగా వినియోగదారులకు అవగాహన కల్పించాలని పేర్కొ న్నారు. ట్రాన్సార్మర్ల చుట్టూ అల్లుకున్న తీగలను తొలగి ంచా లన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యాలను నిర్మూ లించాలని చెప్పారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమా వేశంలో డిప్యూటీ ఎగ్జిక్యూ టివ్ ఇంజినీర్ కులాయప్ప, ఎఇ విజయ్ కుమార్, జెఇ ఉమ పాల్గొన్నారు.

ఆచార్య రామప్రసాదరెడ్డికి 'ఆటా' పురస్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు అధ్యాపకులు ఆచార్య టి.రామప్రసాదరెడ్డికి అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) పురస్కారం లభించింది. ఈనెల 17న హైదరాబాదులోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఆటా అంతర్జాతీయ సాహితీ సదస్సులో ఆటా అధ్యక్షులు బొమ్మినేని మధు, చల్లా జయంత్ చేతుల మీదుగా ఈ ఆత్మీయ పురస్కారాన్ని పొందారు. ఈ సందర్భంగా యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు రామప్రసాదరెడ్డికి అభినందనలు తెలిపారు. జులైలోలో అమెరికాలోని అట్లాంటాలో జరిగే అంతర్జాతీయ సాహిత్య సదస్సుకు నిర్వాహకులు ఆహ్వానించినట్లు పేర్కొన్నారు.

రాజకీయ జోక్యం నివారించాలి

కడప అర్బన్ : జిల్లాలో రాజకీయ అండదండలతో జలకల పథకం పక్కదారి పడుతోందని ఎపి రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి. దస్తగిరి రెడ్డి తెలిపారు. మంగళవారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠం మండలంలో ముడుమాల గ్రామంలో జిలకళ పథకంలో రాజకీయ పలుకుబడి కలిగిన వారికే కింద బోర్లు వేశారని తెలిపారు. అదే గ్రామంలో ఉన్న భూమి కలిగిన ఎస్‌సి కులానికి చెందిన సుధాకర్ అనే రైతు జలకల పథకానికి పేరు నమోదు చేసుకుంటే అక్కడ ఉన్న మండల స్థాయి అధికారులు తిరస్కరించారని చెప్పారు. అదే గ్రామానికి చెందిన రాజకీయ పలుకుబడి ఉపయోగించి బోర్లు వేశారని పేర్కొన్నారు. జలకల పథకం కింద బోర్లు సామాన్య, పేద, ఎస్‌సి, ఎస్‌టి, బిసి కులాలకు చెందిన సన్న, చిన్న కారు రైతులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. అర్హులైన రైతులకు జలకళ పథకం కింద బోర్లు వేయాలని, లేనిపక్షంలో ఆందోళనకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

ప్రజాబలం.. లోకేష్ యువగళం

కడప అర్బన్ : లోకేష్ యువగళం ప్రజా బలమైందని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ అన్నారు. మంగళవారం పాత బస్టాండ్ లోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం యువగళం మొదలవుతూనే జీవో నంబరు 1ని తెచ్చి ఎన్నో ఆంక్షలు విధించి, ఆటంకం కలిగించే ప్రయత్నం చేసినా మొక్కవోని దీక్షతో యువగళాన్ని ప్రజా గళంగా లోకేష్ ముందుకు సాగించారని చెప్పారు. ఈ ఏడాది జనవరి, 27న కుప్పంలో మొదలైన 'యువగళం' పాదయాత్ర 226 రోజుల పాటు 97 నియోజకవర్గాల పరిధిలోని 2100 పై చిలుకు గ్రామాల మీదుగా 3132 కిలోమీటర్ల మేర సాగిందని తెలిపారు. వైసిపి ఎమ్మెల్యేలు, మంత్రులు నారా లోకేష్‌ను అవమానించడం, నిందలు వేయడం, ఎందుకూపనికిరాని వాడని, సినిమాలు తీయడం వ్యక్తిగతంగా టార్గెట్ చేసిన ప్రతి ఒక్కరికి సమాధానం అయ్యాడని చెప్పారు. రాష్ట్రంలో అక్రమ ఇసుక, భూకబ్జాలు, అత్యాచారాలు, అక్రమ దాడులపై ప్రశ్నిస్తూ ప్రజల్లో చైతన్యం తెచ్చారన్నారు.

నేటితో ముగియనున్న చేనేత హస్తకళల ప్రదర్శన, అమ్మకాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

శ్రీ కళాజ్యోతి హ్యాండ్ క్రాఫ్ట్స్ వెల్ఫేర్ సోసైటీ వారు నగరంలోని టిటిడి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న చేనేత, హస్తకళ ప్రదర్శన, అమ్మకాలు బుధవారంలో ముగియనున్నట్లు సోసైటీ కార్యదర్శి వెంకయ్య తెలిపారు. మంగళవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటలవరకు ప్రదర్శన, అమ్మకాలు ఉంటాయని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చేనేత వస్త్రలు హైదరాబాద్ బ్లాక్ ప్రింటింగ్ శారీస్, బెంగాలి కాటన్, మంగళగిరి నారాయణపేట, దర్మవరం, పోచంపల్లి, మధ్యప్రదేశ్, టస్కర్, భాగలపూరి స్కిల్ చీరలు, లక్నో చెకెన్ చీరలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. డ్రస్ మెటీరియల్ కలకారి, మంగళగిరి, చీరాల, పోచంపల్లి, నారాయణపేట, నారాయణవనం అందుబాటులో ఉన్నాయని చెప్పారు. హస్తకళా వస్తువులు, హైదరాబాద్ ముత్యాలు, ఆభరణాలు, గోల్డ్ కవరింగ్ ఆభరణాలు, కొండపల్లి, ఏటికొప్పాక చెక్కబొమ్మలు, వుడ్ కార్వింగ్, సారంగపూర్ వుడ్ ఐటమ్స్, జైపూర్ పెయింటింగ్స్, తిరుపూర్ గార్మెంట్స్, లాక్‌బాంగిల్స్, హెర్బల్ పౌడర్స్, కెస్‌మెదురు, వెట్‌మెటల్స్, బ్లాక్ అండ్ వైట్ మెటల్ బొమ్మలున్నాయన్నారు.



చేనేత వస్త్రాలు ప్రదర్శిస్తున్న సొసైటీ కార్యదర్శి

పిల్లల ఆరోగంపై జాగ్రత్తలు వహించాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప

పిల్లల విద్య, ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఆదేశించారు. మంగళవారం కడప పట్టణం చిన్న చౌక్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ గిరిజన బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలను జడ్జి సందర్శించారు. వంటగదులను, వసతి గదులను, తరగతి గదులను పరిశీలించారు. మధ్యాహ్న సమయంలో వారికి అందుతున్న భోజనం సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలు ఏచే తరగతులను అభ్యసి స్తున్నారు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. పిల్లల విద్యా , ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని అన్నారు. ఏవైనా సమస్య లుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఆయనతోపాటు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీగా వస్తున్న పుట్టా సుధాకర్ యాదవ్, టిడిపి నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - ఖాజీపేట

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసిపికి బుద్ధి చెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని పుల్లూరు పంచాయతీ రహమత్‌ఖాన్‌పల్లె, పూసల కొట్టాలులో భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ముఖ్యమంత్రి జగన్ తీరుతో తీవ్రంగా నష్టపోయారన్నారు. కార్యక్రమంలో టిడిపి మండలం అధ్యక్షులు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, మండల సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి, పత్తూరు పంచాయతీ ఉప సర్పంచ్ ముత్తూరు రమణ నాయుడు, నంద్యాల సుబ్బయ్య యాదవ్, ఇరగంరెడ్డి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ నాయకులు కమలాపురం ఫరూక్ అహ్మద్, గోవింద్ సుబ్బయ్య, తుట్టే రాము యాదవ్, సరిటాల వీరయ్య, పల్లె గంగాధర్, పిచ్చి నాయుడు, అగ్రహారం సొసైటీ మాజీ అధ్యక్షులు కిషోర్‌కుమార్‌రెడ్డి, రామ నాయుడు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులను ప్రతిఘటించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

మహిళలపై జరిగే లైంగిక వేధింపులను ధైర్యంగా ప్రతి ఘటించేలా మహిళలు తయారు కావాలని ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్స్ కమిటీ సభ్యురాలు రత్నకుమారి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో లైంగిక అఘాయిత్యాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికలపై లైంగిక వేధింపులు రోజురోజుకూ అధికమవుతున్నాయన్నారు. లైంగిక వేధింపులు ఆగాలంటే మహిళల్లో చైతన్యం రావాలని పిలుపునిచ్చారు. మహిళలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్ట ప్రకారం తమకు ఉన్న హక్కులపై అవగాహన లేకపోవడం వల్ల లైంగిక వేధింపులతో బాధ పడుతున్నట్లు చెప్పారు. చాలామంది మహిళలు రకరకాలుగా హింసకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలు, శిక్షలు, మహిళ హక్కుల గురించి తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉపశ్రీ, దీప్తి, సువర్ణ, అనుషా రాజ్, అంజలీ ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పెద్దముడియం

ఉపాధి హామీ చట్టంలో అవకతవకలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని డ్వామా పీడీ యదుభూషన్‌రెడ్డి హెచ్చరించారు. స్థానికంగా మంగళవారం పీడీ నేతృత్వంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ చట్టం ద్వారా చేపట్టిన పనులపై మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో గత 20 రోజులు నిర్వహించిన సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపైన చర్చించారు. ఇందులో రూ.6.17 కోట్ల ఉపాధి నిధులు ఖర్చు చేయగా, మస్టర్ నిర్వహణ లోపం విషయంలో రూ. 15,527 రికవరీ కోసం ఆదేశించగా ఓపెన్ ఫోరంలోనే రూ.11,927 రికవరీ చేశారు. సెవెన్ రిజిస్టర్ల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ఉలవపల్లి ఎఫ్ ఎను, చెల్లెలుకు బదులు అన్న విధులు నిర్వర్తించడంతో పాపయపల్లె ఎఫ్‌ఎను సస్పెండ్ చేశారు. కార్యక్రమంలో ఎపిడిఎం ఆనందం, ఎవిఒ యోగాం జనేయరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ డిఇ, ఎంపిడిఒ, ఎపిడి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌విడిసి పిజి కళాశాలలో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక గీతాశ్రమంలోని శ్రీ వెంకటేశ్వర పిజి కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ అర్కాటవేముల హరినారాయణ మాట్లాడుతూ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, అంకితభావంతో చదివితే పోస్ట్ గ్రాడ్యుయేషన్ తర్వాత వివిధ రంగాల్లో విజయాలను సాధించవచ్చున్నారు. 13ఏళ్లుగా పిజి కళాశాల నుండి బయటకు వెళ్లిన విద్యార్థులు మంచి ఉద్యోగాలను పొందారన్నారు. ప్రిన్సిపల్ రామమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో మంచి ప్రతిభ చాటుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మహమ్మద్ ముస్తఫా, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎస్.శ్రీకాంత్ కుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శారద భవాని, అధ్యాపకులు సురేంద్ర, సుబ్బలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న కరస్పాండెంట్ హరినారాయణ

న్యాయసేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి : జడ్జి

ప్రజాశక్తి - చాపాడు

అందుబాటులో ఉన్న న్యాయసేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి ఖాజా మైనుద్దీన్ సూచించారు. చాపాడు మండల న్యాయసేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఆదర్శ గ్రామంగా కేతవరాన్ని ఎంపిక చేసి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అన్యాయం జరిగినప్పుడు న్యాయం పొందాలన్నారు. పుట్టబోయే బిడ్డ నుంచి మృతి చెందే వరకు ప్రతి ఒక్కరికీ చట్టాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. చట్టానికి అందరూ సమానమన్నారు. చట్టాన్ని తెలుసుకుని అందుకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. న్యాయ సాధికారిక ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవలు పొందే అవకాశం ఉందన్నారు. పేద ప్రజలు ఎవరైనా తమకు అన్యాయం జరిగిందని భావిస్తే ఉచితంగా న్యాయ సేవలు పొందవచ్చున్నారు. న్యాయవాదులు అందుబాటులో ఉన్న చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ మైనుద్దీన్, ఆర్ఐ ప్రవీణ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.నారాయణరెడ్డి, పిపి వి.జెఎన్ శర్మ, ఎక్స్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, సీనియర్ న్యాయవాదులు జేకే చారి, సిసి పుల్లయ్య, ఏవి రమణ, కరిముల్లా, ప్యానల్ అడ్వకేట్ ఎం శ్రీనివాసులు ,జూనియర్ అడ్వకేట్ ఖాదర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రోడ్లపై వరి ధాన్యం..!

వాహనదారులకు అసౌకర్యం - తీసేయకపోతే కేసులు : ఇఒపిఆర్‌డి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని బైపాస్ రోడ్లపై వ్యాపారులు వరి ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. వాహనదారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. రబీలో సాగు చేసిన వరి ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేసిన వ్యాపారులు మిల్లర్లకు చేరవేసేందుకు గత కొద్ది రోజులుగా పులివెందుల-రాయచోటి బైపాస్ రోడ్డులో ధాన్యాన్ని రోడ్డుకు ఇరువైపులా పోసి ఎండబెడుతున్నారు. దీంతో ఆ ప్రాంతం గుండా వెళ్లే వాహనదారులు రోడ్డుపై ధాన్యం ఉండడంతో అదుపుతప్పి, ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్ల పక్కన వరిధాన్యాన్ని ఆరబోస్తుండడంతో తరచూగా ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ధాన్యపు సంచులను రోడ్లపైనే పెడుతున్నారు. రోడ్లపై ఉన్న కుప్పలతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. వ్యాపారస్తులు ఇష్టానుసారం రోడ్డుపై ధాన్యం కుప్పలుపోసి రోజుల తరబడి ఆరబోస్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజంతా ఆరబోసిన ధాన్యం సాయంత్రం కాగానే ఎక్కడిక్కడే కుప్పలుగా చేసి రాత్రంతా వాటిని అక్కడే ఉంచుతున్నారు. చీకట్లో కుప్పలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లనే కల్లాలుగా ధాన్యం వ్యాపారులు మార్చుకుంటున్నారు. పులివెందుల-రాయచోటి బైపాస్ రోడ్డులోని రాజీవ్‌కాలనీ వద్ద నుండి అడుగడుగునా రోడ్లపై వరి ధాన్యం కుప్పలు దర్శనమిస్తున్నాయి. పోలీసు అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి జిల్లా పర్యటనకు వస్తుండడంతో మంగళవారం ఇఒపిఆర్‌డి మల్లికార్జునరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి వ్యాపారులకు రోడ్డుపై ఆరబెట్టిన ధ్యాన్యాన్ని ఎత్తి వేయాలని సూచించారు. అయినప్పటికీ వ్యాపారులు ధాన్యాన్ని ఎత్తడానికి సమయం కోరారు. రేపటిలోగా రోడ్లపై వేసిన ధాన్యం ఎత్తకపోతే కేసులు నమోదు పెడతామని ఇఒపిఆర్‌డి మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు.


రాయచోటి-పులివెందుల బైపాస్‌లో రోడ్డుకిరువైపులా ఆరబెట్టిన ధాన్యం

సైన్స్ ప్రయోగాలు ఉపయోగకరం

ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ముగిసిన జిల్లా స్థాయి వైజ్ఞానిక సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ రాఘవరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

సైన్స్ ప్రయోగాలతో విద్యార్థులకు చాలా ఉపయోగకరమని డిఇఒ వై.రాఘవరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో మంగళవారం జిల్లా వైజ్ఞానిక సదస్సు-2023-24ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 36 మండలాల నుంచి 99ప్రదర్శనలతో జిల్లా వైజ్ఞానిక సదస్సు నిర్వహించామన్నారు. విద్యార్థులను సైన్స్ అంశాల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా పాఠశాల స్థాయి, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో వైజ్ఞానిక సదస్సులను నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులు ప్రతి అంశాన్ని సైన్స్ కోణంలో ఆలోచించడం వల్ల ఉన్నతంగా రాణించే అవకాశం ఉంటుందన్నారు. ఈనెల 28, 29తేదీల్లో కడపలో రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు అతిథ్యమిచ్చే అవకాశం లభించిందని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ముఖ్యఅతిథుగా రాష్ట్ర హార్టికల్చర్ సలహాదారులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వైజ్ఞానిక సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అన్ని రాకల వసతులతో తీర్చిదిద్దిందని తెలిపారు. అనంతరం విద్యార్థి విభాగం, గ్రూప్ విభాగం, ఉపాధ్యాయ విభాగాల్లో మంచి ప్రతిభ చూపిన సైన్స్ ప్రయోగాలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఉపవిద్యాశాఖాధికారి జి.క్రిష్ణప్ప, కడప ఉప విద్యాశాఖాధికారి జి.రాజగోపాల్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వర్‌రెడ్డి, ఎస్ఎస్ఎ ఎఎంఒ ఎ.ధనలక్ష్మి, చాపాడు ఎంఇఒ రవిశంకర్, అన్ని మండలాల ఎంఇఒలు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలు : విద్యార్థి విభాగంలో.. భాకరాపేట 11వ బెటాలియన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జి.శిరీషా ఏర్పాటు చేసిన వ్యవసాయంలో రోబో ఉపయోగాలపై ప్రదర్శించిన ప్రాజెక్టుకు మొదటి బహుమతి లభించింది. గ్రూప్ విభాగంలో చెన్నూరు మండలం రామనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్‌వి సందీప్, జి.ఉస్మాన్ రూపొందించిన ఆయుర్వేద వ్యవసాయంపై ప్రాజెక్టు మొదటిస్థానానికి ఎంపికైంది. **ఉపాధ్యాయ విభాగంలో..** ముద్దనూరు బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు కె.హరిప్రియ తయారు చేసిన జీవ వైవిధ్య ప్రదర్శనకు మొదటి బహుమతి వచ్చింది. వీరు రాష్ట్రస్థాయి ప్రదర్శనలో పాల్గొనే అవకాశాన్ని పొందారు.


ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపికైన వ్యవసాయంలో రోబో

అప్పు చేయడంలో ప్రభుత్వాలు దొందూదొందే : పిసిసి


మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

అప్పు చేయడంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం దొందూదొందేనని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి చెప్పారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం దేశాన్ని అప్పుల భారత్ చేసిందన్నారు. 1947 నుంచి 2014 వరకు 67ఏళ్లల్లో నెహ్రూ మొదలుకొని మన్మోహన్ సింగ్ వరకు 13 మంది ప్రధానుల కాలంలో కేంద్ర ప్రభుత్వం చేసిన అప్పు రూ.46 లక్షల కోట్లు కాగా, 2014 నుండి 2023 వరకు 9ఏళ్లల్లో మోడీ ప్రభుత్వం చేసిన అదనపు అప్పు రూ.115 లక్షల కోట్ల అన్నారు. రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా చేసిందన్నారు. 1956 నుండి 2014 వరకు 58 ఏళ్లల్లో సంజీవరెడ్డి మొదలుకొని కిరణ్‌కుమార్‌రెడ్డి వరకు 16 మంది ముఖ్యమంత్రుల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పు రూ.లక్ష కోట్లు కాగా, 2014 నుండి 2019 వరకు అయిదేళ్లల్లో చంద్రబాబు ప్రభుత్వం చేసిన అదనపు అప్పు రూ.లక్షా యాభై వేల కోట్లు అన్నారు. 2019 నుండి నేటి వరకు జగన్ ప్రభుత్వం చేసిన అదనపు అప్పు రూ.7.67 కోట్లు అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలల్లోనే రూ.67500 కోట్లు అప్పు చేసిందని ఆయన వివరించారు. అయినప్పటికీ ఉద్యోగులకు సకాలంలో జీతాలు, విశ్రాంతి ఉద్యోగులకు పెన్షన్లు, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో ఆర్థిక అరాచకత్వం తాండవిస్తోందని కాగ్ ఆక్షేపించిందని తెలిపారు. జగన్ పాలనలో బడ్జెట్ కు విలువలేదన్నారు. బడ్జెట్ కేటాయింపులు లేకుండా రూ.73,694 కోట్లు ఖర్చు చేశారన్నారు. 1914 అంశాలకు రూ.34,171 కోట్లు బడ్జెట్ కేటాయింపులు ఉండి కూడా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. కొన్ని అంశాలకు కేటాయింపుల కన్నా రూ.8,732 కోట్లు అదనంగా ఖర్చు చేసినట్లు తెలిపారు. రాబోవు ఎన్నికల్లో కేంద్రంలో బిజెపిని, రాష్ట్రంలోని వైసిపిని ఓడించాలన్నారు. కేంద్ర, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడమే ఏకైక పరిష్కారమని తులసిరెడ్డి అన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, చెన్నకేశవ, బాలం సుబ్బరాయుడు, నరసింహారెడ్డి, ఉత్తన్న, బద్రి, రాఘవయ్య, గంగిరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని నారాయణ కాలేజీ సమీపంలో ఉన్న శ్రీ సాయి గ్యాస్ ఏజెన్సీ కనెక్షన్ ఉన్నవారు మాండేటరీ కింద రూ.250 చెల్లించాల్సిన అవసరం లేదని గ్యాస్ ఏజెన్సీ యజమాని రాజలక్ష్మి, ప్రవీణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు వారు తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎవరైనా ఇంటి వద్దకు వచ్చి డబ్బు చెల్లించాలని అడిగితే 90009 80887 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలన్నారు. ప్రధానమంత్రి ఉజ్వల పథకం కింద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లను ఇస్తున్నట్లు తెలిపారు. అవసరమైనవారు తమను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ పాల్గొన్నారు.


ట్రై సైకిల్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సంక్షేమ పథకాల తీరుపై ఎమ్మెల్యే ఆరా

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని 13వ కౌన్సిల్ వార్డులో మంగళవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలను ఆరా తీశారు. వైసిపి ప్రభుత్వంలో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందని తెలిపారు. అనంతరం విభిన్నప్రతిభావంతులకు ట్రై సైకిల్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ గౌస్, జడ్‌పిటిసి బాలయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం : మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

గురువారం నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని భాకరాపురంలోని జగన్ క్యాంపు కార్యాలయ సమీపంలో ఉన్న ఆడిటోరియంలో భారీ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ అవినాష్‌రెడ్డి, వైయస్ మనోహర్‌రెడ్డి, వైయస్ మదన్‌మోహన్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. పులివెందుల నియోజకవర్గంలోని వైసిపి నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. పట్టణంలోని కౌన్సిలర్లు, వాలంటీర్లు, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది కూడా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం మరొకరికి ప్రాణదానం చేయడమేనని తెలిపారు.

ఒఎస్‌డికి సిఐ వినతిపత్రం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని అంబకపల్లె రోడ్డు గ్రామీణ బ్యాంకు సమీపంలో ఉన్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీస్‌స్టేషన్‌ను ఇంటి యజమానులు ఖాళీ చేయాలని పలుమార్లు తెలిపారని తన కార్యాలయంలో ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డికి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ రామాంజనేయులు, ఎస్ఐ కల్యాణ్ వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అద్దె చెల్లిస్తున్నప్పటికీ అగ్రిమెంట్ ప్రకారం కాల పరిమితి అయిపోవడంతో పదేపదే ఇంటి యజమానులు ఖాళీ చేయాలని అడుగుతున్నారని తెలిపారు. పాత భవనం కావడంతో స్లాబ్ పెచ్చులూడుతున్నాయని తెలిపారు. సరైన సౌకర్యాలు కూడా లేవన్నారు. అద్దె భవనాలు దొరకపోవడంతో అలానే వారికి నచ్చజెప్పుకుంటూ వస్తున్నామని ఒఎస్‌డికి వివరించారు. ఇందుకు స్పందించిన ఒఎస్‌డి జనవరిలో కొన్ని కార్యాలయాలు ఖాళీ అవుతాయని, అక్కడికి వెళ్లేందుకు మీకు అనుమతినిస్తామని పేర్కొన్నారు.

30న మండల కమిటీలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఈనెల 30న మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నాయకులతో సమావేశమై కమిటీలు వేస్తామని ఎపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో ఎర్రగుంట్ల నగర పంచాయతీలో బస్టాండ్ ఆవరణలో మంగళవారం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి ఆయా గ్రామపంచాయతీల్లో గ్రామాల్లో తిరిగి సమావేశం ఏర్పాటులో అందరూ భాగస్వాములు కావాలని చెప్పి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర చర్మ, డప్పు కళా కారుల అధ్యక్షులు నాగభూషణం, జిల్లా ప్రధాన కార్యదర్శి సహదేవుడు, జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, ఎర్రగుంట్ల మండల యువజన అధ్యక్షులు కొమ్ము రఘు రాముడు, రామయ్య, రామాంజనేయులు, మాతయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువగళం ముగింపు సభకు భారీగా తరలిన కార్యకర్తలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు నుండి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో 500 మంది టిడిపి కార్యకర్తలు మంగళవారం యువగళం ముగింపు సభకు విజయనగరం తరలివెళ్లారు. జమ్మలమడుగు రైల్వేస్టేషన్ నుంచి బయల్దేరారని పార్టీ కార్యాల యం తెలిపింది. నారా లోకేష్ యువగళం పాదయాత్ర ముగిం పు సభ విజయనగరం జిల్లా పోలిపల్లిలో నిర్వ హించనున్నారు. వెళ్లినవారిలో పొన్నతోట శ్రీను, మల్లి, పాలూరు సుధీర్‌కుమార్‌రెడ్డి, మోరగుడి విశ్వనాథరెడ్డి, పెద్దండ్లూరు రామచంద్ర, అంబవరం రామయ్య, కల్వటాల మహేష్, నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు కలరు.


రైల్వేస్టేషన్‌లో టిడిపి కార్యకర్తలు

పనులు త్వరగా పూర్తి చేయాలి

- అధికారులను ఆదేశించిన ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మోడల్ టౌన్‌లో భాగంగా పులివెందుల పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కమిషనర్ వివి నరసింహారెడ్డి సెంట్రల్ బోలే వార్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ దశల్లో జరుగుతున్న పనులు, వాటికి కేటాయించిన గడువు లోపల పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పనుల తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా పనులు చేపట్టాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోడి రమణ, అధికారులు పాల్గొన్నారు.

రూ.10కే భోజనం పెట్టడం హర్షణీయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పేద ప్రజల కడుపు నింపేందుకు గత 20 నెలలుగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ రూ.10కే సంగటి, పప్పు పెడుతూ వారి ఆకలి తీర్చడం హర్షణీయమని పలువురు పేర్కొంటున్నారు. అన్నదాత సుఖీభవ అని ఆయనను దీవిస్తున్నారు. మంగళవారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ అక్కడికి వచ్చి అన్నం తింటున్న వారిని ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆయనే స్వయంగా వడ్డించారు. రుచిలో, శుభ్రతలో ఎలాంటి తేడాల్లేకుండా చూడాలని తెలిపారు. భోజనం కార్యక్రమాన్ని కొనసాగిస్తానని ఆయన పేర్కొన్నారు.